క్లుప్తంగా

అవగాహనతోనే తలసేమియాకు చెక్

మరిపెడ: అవగాహనతోనే తలసేమియాకు చెక్ పెట్టవచ్చని ప్రాథమిక వైద్యాధికారి గుగులోతు రవికుమార్ అన్నారు. ప్రపంచ తలసేమియా దినోత్సవం సందర్భంగా మరిపెడలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎర్రరక్త కణాల్లో ఉండే హిమోగ్లోబిన్‌ను శరీరం తగినంతగా ఉత్పత్తి చేయనప్పుడు ఏర్పడే రక్త వ్యాధినే తలసేమియా అంటారన్నారు. ఇది అల్ఫా, బీటా అనే రెండు ప్రోటీన్లతో ఏర్పడుతుందన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తుల్లో ఎముక మజ్జ(బోన్‌మారో) శరీరానికి కావల్సిన హిమోగ్లోబిన్, ఎర్రరక్త కణాలను తయారుచేయకపోవడంతో శరీరంలోని అన్ని కణాలకు తగినంత ఆక్సీజన్ సరఫరా అందదు. డాక్టర్ స్వామి, సాయిశ్రీ, సిరి, మంగమ్మ, కృష్ణ, ఆచార్యులు, ఏఎన్‌ఎంలు సరళ, నర్సబాయి, ఝాన్సీ, శ్రీదేవి, నాగమణి పాల్గొన్నారు.

సర్వే అధికారులతో వాగ్వాదం



తొర్రూరు రూరల్: మండలంలోని సోమారపు కుంట తండాలో ప్రభుత్వం నిర్మించనున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వేకు వచ్చిన అధికారులను తండా వాసులు గురువారం అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. ఇళ్లులేని నిరుపేదలకు కాకుండా వ్యవసాయ భూములు, ఇతర ఆస్తులు ఉన్న ధనవంతులను ఎలా ఎంపిక చేశారని, వెంటనే వారి పేర్లను తొలగించి, అర్హత కలిగిన పేదలకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

చాకలి కులస్తులు సంఘటితం కావాలి

గూడూరు: చాకలి కులస్తులు సంఘటితమై హక్కుల సాధన కోసం ఉద్యమించాలని చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షురాలు చాకలి శ్రీలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో గురువారం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎదునూరి వెంకన్న అధ్యక్షతన జరిగిన మండల కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. చాకలి ఎస్సీ సాధన సమితి ఏర్పడి 8 సంవత్సరాలు పూర్తయి నేపథ్యంలో ఈ నెల 28న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వార్షికోత్సవ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటప్పయ్య, విజయ్, భీముడు, సాయిలు, శ్రీనివాస్, వెంకన్న, చిట్టిబాబు, బుచ్చిరాములు, యాకయ్య, వెంకన్న పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగంగా చేపట్టాలి

తొర్రూరు రూరల్: కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న వరి ధాన్యం కొనుగోళ్లను వేగంగా చేపట్టాలని తహసీల్దార్ శ్రీనివాస్, సీఐ గణేష్ అన్నారు. మండలంలోని అమ్మాపురం, గుర్తూరు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం వారు పరిశీలించి మాట్లాడారు. కష్టపడి పండించిన ధాన్యాన్ని ఎక్కువ రోజులు నిల్వ ఉంచడం ద్వారా గాలివానలతో రైతులు నష్టపోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై ఉపేందర్, రెవెన్యూ సిబ్బంది శ్రీను, రైతులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి వేడుకలు



తొర్రూరు రూరల్: మండలంలోని గుర్తూరు గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి పండుగ గురువారం ఘనంగా నిర్వహించారు. పెద్దమ్మతల్లి విగ్రహంతోపాటు ఇతర విగ్రహాలను ప్రతిష్ఠించగా మహిళలు బోనాలతో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్రబెల్లి దయాకర్‌రావు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డిలు వేర్వేరుగా దర్శించుకున్నారు.

రేషన్ షాపుల్లో సర్వర్ సమస్య

- నిలిచిన బియ్యం పంపిణీ
- గంటలపాటు పని చేయని నెట్‌వర్క్
- షాపుల వద్దనే లబ్ధిదారుల నిరీక్షణ



వెంకటేశ్వర బజార్‌లోని రేషన్ షాపు వద్ద నిరీక్షిస్తున్న లబ్ధిదారులు (ఇన్‌సెట్‌లో) ఈ-పాస్ మిషన్

మహబూబాబాద్: సర్వర్ సమస్యతో రేషన్ షాపులలో బియ్యం పంపిణీ కొన్ని గంటలపాటు నిలిచిపోయింది. బయోమెట్రిక్ మిషన్‌లో సర్వర్ కనెక్షన్ ఎర్రర్ అని రావడంతో డీలర్లు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో లబ్ధిదారులు గంటలతరబడి షాపుల వద్ద నిరీక్షించారు.

2,40,543 రేషన్‌కార్డులు

జిల్లాలోని 18 మండలాల్లో 9,558 రేషన్‌షాపులు, 2,40,543 రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రతీ నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు డీలర్లు బియ్యం పంపిణీ చేస్తున్నారు. వాస్తవానికి ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పంపిణీ చేయాలి. కానీ కేవలం ఉదయం మాత్రమే పంపిణీ చేస్తున్న డీలర్లు రోజంతా షాపులను మూసిఉంచుతున్నారు. ప్రభుత్వం గత నెల నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తుంది. దాంతో బియ్యం తీసుకునేందుకు లబ్ధిదారులు ఒక్కసారిగా రేషన్ షాపుల వద్దకు వస్తున్నారు.

ఆలస్యంగా స్టాక్

షాపులకు ప్రతి నెల 25వ తేదీ నుంచి 30వ తేదీలోపే ఎంఎల్‌ఎస్ (మండల లెవల్ స్టాకింగ్) గోదాం నుంచి షాపులకు సరఫరా కావాలి. కానీ ఈనెల 2వ తేదీ వరకు సరఫరా చేయలేదు. ప్రతి క్వింటాకు రెండు నుంచి మూడు కిలోలు తక్కువగా వస్తున్నాయని కాంటా వేసి ఇవ్వాలని డీలర్లు ఆందోళన చేశారు. దాంతో సరఫరా ఆలస్యమైంది. జిల్లాకు 4,602 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయించారు. బయోమెట్రిక్, ఐరిష్, ఓటీపీ విధానంతో బియ్యం పంపిణీ చేస్తున్నారు.

నిలిచిన పంపిణీ..

ఈనెల 8వ తేదీన ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సర్వర్ సమస్య వచ్చింది. దాంతో మిషన్లు పని చేయకపోవడంతో పంపిణీ నిలిచింది. జిల్లా మొత్తం ఇదే పరిస్థితి నెలకొంది. దాంతో ఎప్పుడు సర్వర్ కనెక్ట్ అవుతుందోనని డీలర్లు, లబ్ధిదారులు మిషన్ల వద్దనే నిరీక్షించారు. మధ్యాహ్నం 12 గంటలకు సర్వర్ పని చేసింది. డీలర్లు బియ్యం పంపిణీ చేశారు.

డీలర్లకు మరో సమస్య

లబ్ధిదారులు ఎక్కడైనా ఏ షాపులలోనైనా బియ్యం తీసుకోవచ్చు. కాగా కొన్ని షాపుల్లో కేటాయించిన బియ్యం కంటే ఎక్కువ మంది రావడంతో ఆ షాపులో ప్రతి నెలా తీసుకునే వారికి ఇబ్బంది తలెత్తుతుంది. ఇతరులు తీసుకోవడంతో కోటా అయిపోయిందని డీలర్లు సమాధానం ఇస్తున్నారు. దీంతో ప్రతినెలా తీసుకునే కొందరికి బియ్యం ఇవ్వడం లేదు.

లబ్ధిదారులు ఇబ్బంది పడ్డారు

ఉదయం 8 గంటల నుంచి సర్వర్ పనిచేయలేదు. మిషన్ వద్దనే కూర్చోవాల్సి వచ్చింది. సమస్య రాష్ట్ర వ్యాప్తంగా ఉందని తెలిసింది. ఎప్పుడు వచ్చేది తెలియక మాతో పాటు లబ్ధిదారులు వేచిఉన్నారు.

– రాంచందర్, రేషన్‌డీలర్

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ర్యాలీ



కేసముద్రం: ఇనుగుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

కురవి: భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా మండలంలోని రాజోలు హైస్కూల్ విద్యార్థులు గురువారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ హెచ్‌ఎం క్లె వెంకట్‌రెడ్డి మాట్లాడారు. పాఠశాల కమిటీ చైర్మన్ ఈశ్వరీ, ఉపాధ్యాయులు ఎ.రవికుమార్, పి.కాశీనాథ్, వి.ప్రభాకర్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకులు సంబురాలు

మహబూబాబాద్ అర్బన్: ఆపరేషన్ సిందూర్ నిర్వహించినందుకు జిల్లా కేంద్రంలోని బీజేపీ పట్టణ నాయకుల ఆధ్వర్యంలో గురువారం సంబురాలు చేశారు. ప్రధాని మోదీకి చిత్రపటానికి పాలాభిషేకం చేసి టపాసులు కాల్చారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు వెన్నమల్ల అజయ్ కుమార్ మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్యామ్ సుందర్‌శర్మ, నాయకులు అశోక్, ఇందుభారతి, పద్మావతి పాల్గొన్నారు.

ఇనుగుర్తిలో..

కేసముద్రం: ఆపరేషన్ సిందూర్ విజయాన్ని స్వాగతిస్తూ ఇనుగుర్తిలో భారత సైన్యానికి మద్దతుగా ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం వరంగల్ విద్యార్థులు, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు కలిసి గురువారం ర్యాలీ నిర్వహించారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పారాయణం చేస్తున్న పూజారి

గూడూరు: మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో గురువారం రాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ పూజారి వేణుగోపాలాచార్యులు ద్రావిడ వేద పారాయణంతో అధ్యయనోత్సవాన్ని తొళక్కంతో ప్రారంభించారు. అనంతరం విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఏపూరు శ్యాంసుందర్‌రెడ్డి, అధ్యక్షుడు నూనావత్ రమేష్‌నాయక్, మేరుగు నరేష్‌గౌడ్, పుల్లూరు భాస్కర్‌గౌడ్, కాల్సాని వేణుమాధవ్‌రెడ్డి, చిక్కుల నరేష్ పాల్గొన్నారు.

పాత కార్మిక చట్టాలనే కొనసాగించాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి సుధాకర్



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

నెహ్రూసెంటర్: కార్మికులు పోరాడి సాధించుకున్న పాత కార్మిక చట్టాలనే కొనసాగించాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో గురువారం మున్సిపల్ కార్మిక విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20వ తేదీన జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, నాగన్న, మంగీలాల్, వీరన్న, లక్ష్మి, మంజుల పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

గార్ల/కురవి: దేశవ్యాప్తంగా ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు పెద్ద వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పోతుగంటి మల్లయ్య వేర్వేరుగా పిలుపునిచ్చారు. గురువారం గార్ల మండలంలోని పినిరెడ్డి గూడెం గ్రామ సమీపంలోని ఊరచెరువులో ఉపాధి కూలీలతో కలిసి వెంకటేశ్వర్లు సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. కురవి మండలం నేరడ గ్రామంలో తెలంగాణ హమాలీ యూనియన్(సీఐటీయూ) సమావేశంలో సార్వత్రిక సమ్మె కరపత్రాలను పోతుగంటి మల్లయ్య ఆవిష్కరించారు. నాయకులు ఎల్లయ్య, నాగమణి, కొండయ్య, పద్మ, రమేష్, యాకన్న, ముచ్చర్ల లింగన్న తదితరులు పాల్గొన్నారు.

నిప్పంటుకుని పంట పొలం దగ్ధం

దంతాలపల్లి: కుమ్మరికుంట్లలో రైతు వల్లపు కృష్ణ ఎకరం పొలం గురువారం సాయంత్రం కాలిబూడిదైంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. తనకున్న ఎకరం పొలం సాగుచేయగా కోతకు వచ్చింది. ఈ క్రమంలోనే గుర్తు తెలియని వ్యక్తులు పొలంలో కొయకాలు(వరిమొదళ్లు) కాల్చడంకోసం నిప్పు పెట్టారు. కోయకాలు కాలుకుంటు పోయి కోతకు వచ్చిన పొలం పూర్తిగా కాలిపోయింది.

రామవరంలో మామిడి, టేకు చెట్లు..

రామవరంలో రైతు పగిడిపెల్లి వెంకటయ్యకు చెందిన 20 మామిడి చెట్లు 30 టేకు చెట్లు గురువారం సాయంత్రం కాలిపోయాయి. రైతు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తులు పొలంలోని వ్యర్థాలను కాల్చడం కోసం, నిప్పు పెట్టడంతో చెట్లతోపాటు మామిడి కాయలు కాలిపోయాయని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. రామవరం, చీకటయపాలెం, మాటేడు గ్రామాల రైతులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేశారని తెలిపారు. చీకటి కావడంతో నష్టం అంచనా వేయలేకపోతున్నట్లు రైతు వెంకన్న తెలిపాడు.

దాట్ల గ్రామంలో పశుగ్రాసం..

దాట్ల గ్రామంలో రైతు దబెన వీరభద్రానికి చెందిన పశుగ్రాసం ప్రమాదవశాత్తు దగ్ధమైన ఘటన గురువారం చోటుచేసుకుంది. బాధితుడు వీరభద్రం, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పశువుల కోసం 300 మోపుల గ్రాసం నిల్వ ఉంచాడు. ఇంట్లోవారంతా పనికివెళ్లిన తర్వాత ప్రమాదవశాత్తు గడ్డివాముకు నిప్పంటుకుని 130 మోపులు దగ్ధమైనట్లు తెలిపారు. రూ.15 వేల నష్టం వాటిల్లిందని వాపోయాడు.

కురవిలో నర్సరీ..

కురవి: మండల కేంద్రంలోని శ్రీవీరభద్ర నర్సరీ ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గురువారం దగ్ధమైంది. వివరాలిలా ఉన్నాయి. నర్సరీలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని నల్ల పైపులు, నర్సరీకి అమర్చిన పరదాలు కాలిపోయాయి. కురవి ఎఎస్సై వెంకన్న సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

నీళ్లివ్వకుండా ద్రోహం చేసిన పాలకులు

- టీవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంపాల విశ్వ



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వ

గార్ల: సీతారామ ప్రాజెక్ట్ మొదటి నిర్దేశిత ప్రాంతాలైన ఇల్లందు, డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాలకు నీళ్లు ఇవ్వకుండా పాలకులు తీరని ద్రోహం చేశారని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంపాల విశ్వ ఆరోపించారు. గురువారం గార్లలో వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకుల రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇల్లందు నియోజకవర్గంలోని రోళ్లపాడు వద్ద ఈ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం నాటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. నాటి ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన తుమ్మల నాగేశ్వరరావు స్వార్థంతో ప్రాజెక్ట్ రీ డిజైన్‌ను మార్చి పాలేరు, సత్తుపల్లి నియోజక వర్గాలకు నీటిని తీసుకెళ్లి, ఇల్లందు, మహబూబాబాద్, డోర్నకల్ నియోజకవర్గాలకు అన్యాయం చేశారని మండిపడ్డారు. ప్రాజెక్ట్ రీడిజైన్, రీ ఇంజనీరింగ్, రీ ఎస్టిమేషన్‌తో ఈ ప్రాజెక్ట్ నిర్మాణంలో పెద్ద మొత్తంలో అవినీతి జరిగిందని, కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదన్నారు. ఈ ప్రాజెక్ట్‌తో నేటికీ ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదని పేర్కొన్నారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు శ్రీనివాస్, సత్యవతి, వెంకన్న, లక్ష్మణ్‌నాయక్, సక్రు, రాధాకృష్ణ, వెంకట్‌రెడ్డి, శివాజీ, సత్యం, ఈశ్వర్ లింగం, నాగేశ్వరరావు, హరినాయక్, రాము, మాన్యా, నర్సయ్య, ప్రభాకర్, కిరణ్ పాల్గొన్నారు.

విజయంలో స్థానిక కమిటీలదే కీలకపాత్ర



మాట్లాడుతున్న విప్ రాంచంద్రునాయక్

దంతాలపల్లి: పార్టీ విజయం సాధించాలంటే మండల, గ్రామ కమిటీలదే కీలక పాత్ర అని ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్ అన్నారు. గురువారం మండలంలోని కుమ్మరికుంట్లలో నిర్వహించిన పార్టీ అంతర్గత కమిటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల, గ్రామ కమిటీల ఎంపికకు కార్యకర్తలనుంచి దరఖాస్తులు తీసుకున్నారు. డీసీసీ అధ్యక్షుడు భరత్ చందర్‌రెడ్డి, రవళిరెడ్డి, నాగేశ్వరరావు, బట్టునాయక్, రాము, సురేష్ పాల్గొన్నారు.

ఏం తమాషాలు చేస్తున్నారా..?

'ఏం తమాషాలు చేస్తున్నారా.. పార్టీ పరువు తీసేందకు తయారు అవుతున్నారు. ఏదైన ఉంటే నాతో చెప్పండి, అంతే గాని నాముందు గొడవ పెట్టుకుంటే ఊరుకునే ప్రసక్తే లేదు' అని విప్ రామచంద్రునాయక్ కార్యకర్తలకు వార్నింగ్ ఇచ్చారు. ఓ గ్రామానికి చెందిన కార్యకర్తలు ఇందిరమ్మ ఇళ్ల విషయంలో తన ఎదుటే తగాదా పడడంతో విప్ వారించారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

చిన్నగూడూరు: గ్రామస్థాయి ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో పాల్గొన్నారు. కూచన రవళీరెడ్డి, నాగేశ్వరరావు దరఖాస్తులు తీసుకున్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యక్రమానికి నిరసన సెగలు



రావిరాలలో గొడపడుతున్న కాంగ్రెస్ నాయకులు

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాల్లో మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న జై బాపు, జై భీం, జై సంవిధాన్ అవగాహన కార్యక్రమానికి ఇందిరమ్మ ఇళ్లు నరసన సెగలతో సొంతపార్టీలోనే గొడవలు జరుగుతున్నాయి. గురువారం మండలంలోని బంజర, శ్రీరామగిరి, మునిగలవీడు, రావిరాల గ్రామంలో కార్యక్రమం నిర్వహించారు. మునిగలవీడు గ్రామంలో ముందస్తుగా సమాచారం ఇవ్వలేదని గ్రామంలో ముఖ్య నాయకులు కార్యక్రమానికి దుమ్మకొట్టారు. రావిరాల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరి ఒక వర్గానికి చెందిన వారి పేర్లు పెట్టుకున్నారని రెండు వర్గాలు గొడవ పడ్డాయి. నాయకులు ప్రభాకర్ గౌడ్, ఎదళ్ల యాదవరెడ్డి, బాలాజి నాయక్, హెచ్ వెంకటేశ్వర్లు, పెరుమాండ్ల గుట్టయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ప్రణవి

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్వహించిన రాష్ట్రస్థాయిలో జూనియర్ బాలబాలికల ఎంపికలో మానుకోటలోని అనంతారం బీ ఫార్మసీ కళాశాలకు చెందిన తక్కలపల్లి ప్రణవి ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికై ందని కళాశాల పీడీ సునీత గురువారం తెలిపారు. ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు మహారాష్ట్రలో జరిగే టోర్నమెంట్‌లో ప్రణవి పాల్గొంటుందని వెల్లడించారు. ప్రిన్సిపాల్ స్వప్న రెడ్డి, అధ్యాపకులు.. ప్రణవిని అభినందించారు.

మండలంలో భారీ వర్షం

బయ్యారం: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. బయ్యారం, గంధంపల్లి, కొత్తపేట, వెంకట్రాంపురం, బాలాజీపేట, ఉప్పలపాడు, గౌరారం తదితర గ్రామాల్లో కురిసిన భారీ వర్షంకు వీధులు జలమయమైనాయి. వర్షంతో బయ్యారం, కొత్తపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం రాశులు తడవకుండా టార్పాలిన్లు కప్పి జాగ్రత్తలు తీసుకున్నారు.

నేడు భగీరథ నీటి సరఫరా బంద్

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని సలార్‌తండా సమీపంలో మిషన్ భగీరథ 1000 ఎంఎం పీసీసీపీ మెయిన్ పైపులైన్ లీకేజీతో నీరు వృథగా పోతోంది. దీంతో నిజాం చెరువు పంప్‌హౌజ్ పంపులు నిలిపివేసి మరమత్తులు చేపట్టనున్నారు. ఈనేపథ్యంలో నేడు (శుక్రవారం) జిల్లా కేంద్రంలో, కురవి, కేసముద్రం, డోర్నకల్ మండలల్లో నీటీ సరఫరా బంద్ చేస్తున్నట్లు మిషన్ భగీరథ అధికారి ఏఈ కృష్ణరెడ్డి గురువారం తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని మున్సిపల్, పంచాయతీ అధికారులు ప్రజలకు ప్రత్యామ్నాయ తాగునీటి ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు.

పరామర్శ

మహబూబాబాద్ రూరల్ : సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకురాలు మండల అరుణశ్రీ మృతిచెందగా ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ గురువారం ఆమె చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అరుణశ్రీ భర్త మండల వెంకన్న ఓదార్చారు. నాయకులు ఎడ్ల రమేష్, ఎండీ.ఖలీల్, ప్రవీణ్ కుమార్, వెంకన్న, లింగన్న, పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల అడ్మిషన్లకు డ్రా

దోర్నకల్: స్థానిక మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతికి సంబంధించి నాన్‌మైనార్టీ కోటాలో అడ్మిషన్ల కోసం గురువారం డ్రా నిర్వహించారు. 5వ తరగతిలో నాన్‌మైనార్టీ కోటాలో 20 సీట్లకు డ్రా ద్వారా 19 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. జిల్లా మైనార్టీ అధికారి శ్రీనివాసరావు సమక్షంలో ఈ ప్రక్రియను చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రిజ్వానా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల వద్ద బడిబాట



దోర్నకల్: సీరోలు మండలం మన్నెగూడెం గ్రామంలో గురువారం జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు ఉపాధి పనుల వద్ద బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సమీంపలోని చెరువు వద్ద జరుగుతున్న ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీలను కలిసి బడిబాట కార్యక్రమంపై వివరించారు. ముల్కలపల్లి స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రుక్మాంగదరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల ఉచిత వసతులు కల్పిస్తూ నాణ్యమైన విద్యను బోధిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విత్తనాల సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

దంతాలపల్లి: మండలంలో ఈనెల 5న ప్రారంభమైన రెవెన్యూ సదస్సులు కొనసాగుతున్నాయి. సదస్సులో భాగంగా గురువారం మండలంలోని గున్నెపల్లి, రేపోని గ్రామాల్లో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో తొర్రూరు ఆర్డీఓ గణేష్, నర్సింహులపేట, దంతాలపల్లి తహసీల్దార్లు సునీల్‌కుమార్, నాగరాజు, ఎంపీడీఓ వివేక్‌రామ్, ఆర్‌ఐలు నజీముద్దీన్, రాజు, ఎంపీఓ అప్సర్ పాషా, రెవెన్యూ సిబ్బంది పాల్గొని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

దాహార్తిని తీర్చడం అభినందనీయం

మహబూబాబాద్ రూరల్ : వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయటం అభినందనీయమని రైల్వే ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ ఎస్.వీ.ఎస్.మోహన్ కుమార్ అన్నారు. శ్రీమహాలక్ష్మి గణపతి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ రైల్వే స్టేషన్ ఆవరణలో గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ బాధ్యులు ఎస్.వీ.నాగేశ్వరరావు, శ్రీరంగం రామారావు, సోమ శ్రీనివాస్, సోమ రాంబాబు, మాజీ మున్సిపల్ వార్డు కౌన్సిలర్ చిట్యాల జనార్ధన్, ప్రముఖ న్యాయవాది ప్రొద్దుటూరు రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో..

కేసముద్రం: మున్సిపాలిటీ కేంద్రంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య గురువారం ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహర్తీ తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రవికిరణ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

పున:ప్రతిష్ఠకు నిర్ణయం



మహబూబాబాద్ రూరల్ : శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారి దేవాలయ విమాన గోపురం, సుదర్శన చక్రం పున:ప్రతిష్ఠకు నిర్ణయం తీసుకున్నారని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. శ్రీవారి ఆలయ విమాన గోపురం, సుదర్శన చక్రం భిన్నమైనందున పున:ప్రతిష్ఠ చేసే విషయమై శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామివారి దేవాలయ ప్రాంగణంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి సమక్షంలో ఆలయ కమిటీ బాధ్యులతో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

కేసముద్రం: మున్సిపాలిటీ పరిధిలోని సబ్‌స్టేషన్ తండాలో ఏర్పాటు చేసిన 8 సీసీ కెమెరాలను మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య గురువారం ప్రారంభించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు తండాకు చెందిన బాదావత్ పవన్, తండావాసులు సహకారం అందించడం అభినందనీయమని అన్నారు. అనంతరం మతసామరస్యంపై వివిధ మతాల పెద్దలతో శాంతి కమిటీ సమావేశాన్ని రూరల్ సీఐ సర్వయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్సైలు రవికిరణ్, కరుణాకర్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

యువకుడి ఆత్మహత్య



నరేష్ (ఫైల్)

గార్ల: మద్యానికి బానిసై పురుగుమందు తాగి ఓ యువకుడు మృతిచెందిన ఘటన గురువారం పాతపోచారం గ్రామంలో చోటుచేసుకుంది. ట్రెయినీ ఎస్సై మైబూబీ తెలిపిన వివరాల ప్రకారం.. గార్ల మండలం పాతపోచారం గ్రామానికి చెందిన పసుపులేటి నరేష్(26) తనకున్న జేసీబీ, ట్రాక్టర్ వాహనాల కిస్తీలు చెల్లించకుండా మద్యానికి బానిసై దుబారా ఖర్చులు చేస్తూ తిరుగుతుండడంతో తల్లి మందలించింది. దీంతో తెల్లవారుజామున కుటుంబ సభ్యులందరూ నిద్రిస్తున్న సమయంలో నరేష్ పురుగు మందు తాగి, అన్నకు ఫోన్‌చేసి చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు నరేష్‌ను ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతుడి తండ్రి రామయ్య ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రెయినీ ఎస్సై తెలిపారు.

ఆలయం ఎదుట మహిళ మృతి



ఈరి (ఫైల్)

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయం ఎదుట ఉన్న బొమ్మల దుకాణాల వద్ద మూడు ఈరి(50) గురువారం తెల్లవారుజామున మృతిచెందింది. కురవి శివారు తులిస్యాతండా పరిధిలోని భద్రుతండాకు చెందిన ఈరి.. గుడి ప్రాంతంలో తిరుగుతూ ఉంటుంది. దుకాణాల ఎదుట కిందపడిపోయి ఉండగా స్థానికులు పరిశీలించగా ఆమె మృతిచెందింది. మృతురాలికి భర్త స్వామి, కొడుకు, కుమార్తె ఉన్నారు.

పిడుగుపాటుతో అస్వస్థతకు గురైన మహిళ

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో పిడుగుపాటుకు గురై ఓ మహిళ అస్వస్థతకు గురైన సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గురువారం రాత్రి వీచిన గాలి దుమారానికి ఉరుములు, మెరుపులతో మండల కేంద్రానికి చెందిన కొమ్ము ఎల్లమ్మ ఇంటి సమీపంలో ఉన్న తాడిచెట్టుపై పిడుగు పడింది. ఈ క్రమంలో ఇంటి ముందు ఉన్న ఎల్లమ్మ అస్వస్థతకు గురైంది. స్థానికులు గుర్తించి ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం అంబులెన్స్‌లో జిల్లా కేంద్రానికి తరలించారు.

తునికాకు కూలీలకు గాయాలు



గాయపడిన తునికాకు కూలీ

కొత్తగూడ: తునికాకు సేకరణకు వెళ్లిన ఇద్దరు కూలీలు ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి గాయపడిన సంఘటన మండలంలోని లక్ష్మీపురంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పుల్సం కన్నమ్మ, వజ్జ ఎల్లమ్మలు తునికాకు సేకరించడానికి సమీప అటవీ ప్రాంతానికి వెళ్లారు. పెద్దచెట్టుకు ఉన్న తునికాకును సేకరించేందుకు చెట్టు ఎక్కి ఆకులు తెంపుతుండగా కొమ్మ విరిగి ప్రమాదవశాత్తు కింద పడిపోయారు. ఘటనలో ఇరువురికి గాయాలు కాగా 108 ద్వారా వరంగల్ ఎంజీఎంకు తరలించారు. గాయపడిన కూలీలకు ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

ఎంజేపీ కళాశాలను మానుకోటలోనే కొనసాగించాలి

మహబూబాబాద్ రూరల్ : మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలను మహబూబాబాద్ జిల్లాలోనే కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ బీసీ రాజ్యాధికార సమితి నేతలు గురువారం ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కార్యదర్శి ముంజాల రాజేందర్ గౌడ్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలకు సరైన భవన వసతిలేదనే నెపంతో హనుమకొండ జిల్లా కాజీపేట మండలం సోమిడి గ్రామంలో కొనసాగుతుందని, విద్యార్థినులు అక్కడికివెళ్లలేక చదువుకు దూరం అవుతున్నారని, మహబూబాబాద్లోనే కొనసాగించాలని కోరారు. గండి వీరేందర్ గౌడ్, శ్రీధర్, వీరభద్రం గౌడ్, వీరన్న, వెంకన్న, వెంకట్, కుమారస్వామి, మధు, శంతన్ రామరాజు, తదితరులు పాల్గొన్నారు.